సాక్షి వికారాబాద్

ఆదివారం । 4 । ఆగస్టు । 2024



ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో శనివారం అగ్నిప్రమాదం జరిగి, పలువురు కార్మికులు గాయపడినట్లు తెలిసింది. 8లో▸



స్నేహమే జీవితం..శాశ్వతం

ప్రతీ ఒక్కరికి మంచి స్నేహితులను ఎంచుకునే అవకాశం ఉంటుంది. చదవులు, ఉద్యోగాల పేరిట ఉన్నఊరు.. కన్నతల్లిని వదిలివెళ్లిన వారికి మిత్రులే అన్నీ అవుతున్నారు. మన చుట్టూ ఉన్న స్నేహితులను చూసి వ్యక్తిత్వాన్ని అంచనావేయొచ్చు. స్నేహితులను గుర్తు చేసుకునేందుకు వీలుగా ప్రతీ సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. నేడు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం. - వివరాలు 8లో▸

న్యూస్‌రీల్

గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ అధ్యాపకుల నియామకానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శంకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూర్‌లో ఉర్దూ మీడియంలో ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ (ఒకేషనల్,) పెద్దేముల్‌లో కెమిస్ట్రీ (తెలుగు మీడియం)పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత గల్గిన అభ్యర్థులు ఈనెల 5 నుంచి 7 వరకు వికారాబాద్‌లోని జిల్లా ఇంటర్మీడియెట్ కార్యాలయం(జెడ్పీహెచ్ఎస్ బాలుర, అనంతగిరిరోడ్డు ఆవరణలోని) ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సమర్పించాలన్నారు.

రేపు తాండూరులో మంత్రుల పర్యటన

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తాండూరులో పర్యటిస్తారని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, ఈఎన్సీ మోహన్‌నాయక్, ఎస్‌ఈ వసంత్‌కుమార్, ఈఈ శ్రీధర్‌బాబుతో పాటు తాండూరు డివిజన్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రుల పర్యటన సజావుగా సాగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాండూరు, బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవంతో పాటు చిలుక వాగు ప్రక్షాళన పనులు, తాండూరులోని విలియంమూన్ సర్కిల్ నుంచి పెద్దేముల్ మార్గంలోని బైపాస్ రోడ్డువరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్లు

పట్టణ శివారులో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి. నిర్మాణ దశలో ఉన్నవి ఎన్ని అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాలను పూర్తి చేసి త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో కార్మికుడి మృతి

కొత్తూరు: విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొడిచర్లకు చెందిన బాలుచారి(35) కొన్నేళ్లుగా ట్రాన్స్‌కోలో ఆర్టిజన్ (హెల్పర్)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సిద్ధాపూర్ శివారులో 11కేవీ స్తంభం వద్ద జంపర్ తెగిపోయింది. సమాచారం రావడంతో బాలుచారి అక్కడికి చేరుకుని మరమ్మతులు చేసేందుకు స్తంభం పైకి ఎక్కాడు. మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం మహేశ్వరం మండలం మన్సాన్‌పల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణం ట్రాన్స్‌కో సిబ్బంది సమన్వయ లోపమా..? స్తంభం ఎక్కి మరమ్మతులు చేయడానికి ముందు బాలుచారి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని (ఎల్‌సీ) అనుమతులు తీసుకున్నాడా..? లేదా..? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై ఏఈ సాయికృష్ణను వివరణ కోరగా మరమ్మతులకు ముందు బాలుచారి అనుమతులు తీసుకోనట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. మృతుడికి భార్యతో పాటు మూడేళ్ల కూతురు ఉంది.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పవన్ చౌహాన్

షాద్‌నగర్: ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన పవన్ చౌహాన్ ఎన్నికయ్యారు. రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో శనివారం సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా పవన్ చౌహాన్, జిల్లా కార్యదర్శిగా వంశీవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు.



ఎలక్ట్రిక్ రైడ్

మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల జోరు

- కాలుష్య రహితం.. ఖర్చు మితం
- తగ్గిన ఇం'ధన' వెతలు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు
- ఆసక్తి చూపుతున్న వాహనదారులు

ఉరుకులపరుగుల జీవనగమనంలో త్వరగా 'గమ్యం' చేరేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత వాహనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో వాటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.. అదే క్రమంలో ఇంధన ధరలు అంతకంతకూ పెరుగుతూ పోతున్నాయి..ఈ నేపథ్యంలో మిగులు 'బడ్జెట్' కోసం వాహనదారులు ఎలక్ట్రిక్ వెహికిల్స్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంధనం ఖర్చు లేకపోవడం.. జీరో మెయింటెనెన్స్.. కారణంగా చాలా మంది వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ ఆధారిత వాహనాల కొనుగోలును, వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. సాధారణ కార్లు, బైక్‌లు, స్కూటీలతో పోలిస్తే తక్కువ ఖర్చు అవుతోందని, సౌకర్యంగానూ ఉందని వినియోగదారులు చెబుతున్నారు. పెట్రోల్, సర్వీసింగ్ ఖర్చులు మిగులుతుండడం.. ఒక్కసారి చార్జింగ్ చేస్తే చాలు వంద కిలోమీటర్ల వరకు వెళ్లే అవకాశం ఉండడంతో 'ఈ–బైక్'లు, 'ఈ–కార్ల'పై రయ్‌మని దూసుకెళ్తున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి: ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేసిన సంతోషంలో ఓ కుటుంబం

అనంతగిరి/తాండూరు: ఎలక్ట్రిక్ వాహనాలు తాండూరు రోడ్లపై రయ్‌మంటూ చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం సామాన్య, మధ్యతరగతి ప్రజలు సైతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపంచడంతో ఈ వాహనాల సంఖ్య పెరుగుతోంది. ఒకసారి కొనుగోలు చేసిన వాహనం రెండు మూడేళ్ల వరకు ఎలాంటి సర్వీసింగ్ అవసరం లేదు. ఇంధన భారం లేకుండా నడిచే వాహనాలు కావడంతో వాహనదారులకు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణంలో హీరో, హోండా, బజాజ్, టీవీఎస్, బుల్లెట్(ఎన్‌ఫీల్డ్) లాంటి షోరూంలతో పాటు ఐదు మల్టీ బ్రాండ్ షోరూంలు అందుబాటులో ఉన్నాయి. ఏడేళ్ల క్రితమే ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్‌లోకి వచ్చినా ఆశించిన స్థాయిలో మార్కెట్‌లో అమ్మకాలు జరగలేదు. రెండేళ్ల క్రితం తాండూరులో పలు కంపెనీలకు చెందిన ఎలక్ట్రిక్ బైక్‌ల అమ్మకాలకు స్థానికులు షోరూమ్‌లు ఏర్పాటు చేశారు. అయితే పలు కారణాలతో షోరూమ్‌లను ఏడాదిలోపే మూసి వేశారు. అనంతరం టీవీఎస్ కంపెనీ సైతం ఎలక్ట్రిక్ వాహనాల తయారు చేయడంతో ప్రస్తుతం టీవీఎస్ షోరూమ్‌లలో వాహనాల అమ్మకాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని టీవీఎస్ షోరూమ్‌లో ప్రతీ నెల 15 ద్విచక్రవాహనాలను విక్రయిస్తే వాటిలో తొమ్మిది పెట్రోల్ వాహనాలు,ఆరు ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు జరుగుతున్నాయని షోరూం నిర్వాహకుడు పేర్కొన్నారు.

వికారాబాద్‌లో 800కు పైగా..

ఎలక్ట్రిక్ బైక్ అంటేనే జీరో మెయింటెనెన్స్. ఇతర వాహనాల ఇంధన ఖర్చులో ఈవీ బైక్ నెలవారీ వాయిదా చెల్లిస్తున్నాం. కొనుగోలు చేసేటపుడు మాత్రమే పెట్టుబడి తప్పా సర్వీసింగ్ అవసరం లేదు. వికారాబాద్ ప్రాంతంలో 800 వరకు ఎలక్ట్రిక్ బైకులు ఉన్నట్లు అంచనా. వికారాబాద్ పట్టణంలోని ఓలా కంపెనీ బైకులు నెలకు 30వరకు అమ్ముడుపోతున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. వికారాబాద్‌లో బైక్‌లతో పాటు ఎలక్ట్రిక్ కార్లు సైతం కొనుగోలు చేస్తున్నారు.

టెక్నీషియన్లు లేక ఇబ్బందులు

రెండుమూడేళ్లకు వాహనం మరమ్మతులకు గురైతే తాండూరుతో పాటు జిల్లాలో ఏ ఒక్క టెక్నీషియన్ లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరమ్మత్తులకు గురైన వాహనాన్ని హైదరాబాద్‌లోనే రిపేర్ చేయించాలి. అందుకు వాహనాన్ని ట్రాన్స్‌పోర్టు ద్వారా తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు గత అనుభవాల దృష్ట్యా నిరాకరిస్తున్నారు. ట్రాన్స్‌పోర్టుకు సైతం ఆర్థిక భారం పడుతోంది. రిపేరు చేసేందుకు రూ.500 అయితే రవాణాకు రూ.5వేలు అవుతున్నాయంటున్నారు.

ఆరేళ్ల క్రితం కొన్నా



ఎలక్ట్రిక్ వాహనంతో ఇంధన భారం తగ్గుతోంది. ఆరేళ్ల క్రితం రూ.70వేలకు వాహనం కొనుగోలు చేశా. మూడేళ్ల వ్యవధిలో ఇంధన ఖర్చు లేకపోవడంతో వాహనానికి పెట్టినడబ్బులు ఇంధన రూపంలో తిరిగి వచ్చినట్లే. మూడేళ్ల తర్వాత రిపేర్ వస్తే హైదరాబాద్‌కు తీసుకెళ్లి చేయించా.

– కుమారస్వామి, తాండూరు

సెల్‌ఫోన్‌తో ఆన్.. ఆఫ్



ఓలా ఎలక్ట్రిక్ స్కూటీని కొనుగోలు చేసి ఏడాది అవుతోంది. ఒక్కసారి ఇంట్లో విద్యుత్ చార్జింగ్ చేస్తే 185 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయవచ్చు. ఏడాదిలో రూ.14 వేల వరకు ఇంధన ఖర్చు తగ్గింది. ఈ వాహనాలకు బ్లూటూత్ సిస్టం ఉండడంతో సెల్‌ఫోన్ ద్వారానే వాహనాన్ని ఆన్, ఆఫ్ చేసుకునే విధానం ఉంది.

– నరేందర్, కానిస్టేబుల్, తాండూరుటౌన్

చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు అవసరం



ఎలక్ట్రిక్ వాహనాలు చార్జింగ్ చేసేందుకు ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి. రూ.30లక్షలు వెచ్చించి ఈఎంఐలో ఎంజీ కంపెనీ కారు కొనుగోలు చేశా. బ్యాటరీ ఫుల్ చార్జ్ చేస్తే కేవలం 350 కిలోమీటర్లే తిరుగుతోంది. బ్యాటరీ సామర్థ్యం 500 కిలోమీటర్లకు పెంచాలి

– మేఘనాథ్‌గౌడ్, మాజీ సర్పంచ్, సంగెం కలాన్

నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వాలి



ఎలక్ట్రిక్ వాహనాలకు టెక్నీషియన్‌లు లేకపోవడంతో వాహనాల కొనుగోలుకు వేచి చూస్తున్నారు. నిరుద్యోగ యువతకు టెక్నీషియన్‌లుగా శిక్షణ ఇప్పించాలి

– నర్కుల రాజన్‌గౌడ్, రాజ్ మోటర్స్, తాండూరు

'ఫ్రీ' చార్జింగ్



కుల్కచర్ల: మూడేళ్ల క్రితం ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశా. ఆర్సీ సైతం అవసరం లేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్‌తో చార్జింగ్‌కు కూడా ఖర్చు లేదు.

– శ్రీనివాస్, కాముని‌పల్లి

సౌకర్యవంతంగా ప్రయాణం



కుల్కచర్ల: ఎలక్ట్రిక్ స్కూటీతో సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. జీరో మెయింటెనెన్స్ కలిసొస్తుంది. ఒక్కసారి చార్జింగ్ పెడితే వంద కిలోమీటర్ల ప్రయాణం చేయవచ్చు.

– రాజు

పర్యావరణానికి మేలు



దుద్యాల్: ప్రస్తుతం తరుణంలో ఎలక్ట్రిక్ వాహనాలే ఎంతో మేలు. ఇప్పటికే అవగాహన వచ్చింది. ఈవీ వాహనాల కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నారు.

– భాస్కర్

160 కిలోమీటర్ల మైలేజీ



తాండూరు రూరల్: ఎంజీ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ కారు కొన్నారు. ఫుల్ చార్జింగ్‌కు 4గంటల సమయం పడుతోంది. 160 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇస్తోంది.

– నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, మిట్టబాసుపల్లి

డబ్బు ఆదా

పరిగి: గతంలో బైక్ మెయింటనెన్స్‌కు రూ.6వేలు పైగా ఖర్చు అయ్యేది. ఆర్నెళ్ల క్రితం ఈవీ బైక్ కొనుగోలు చేశా. ప్రతీ నెల రూ.500లోపు ఖర్చవుతోంది. నెలకు 60 యూనిట్లు విద్యుత్ ఖర్చవుతోంది. ఈ ఈవీ బైక్‌తో డబ్బు ఆదాతో పాటు, పర్యావరణానికి మేలు చేకూరుతోంది.

– శ్రీనివాస్, మోత్కూర్

ఈవీతో ఈజీ



బంట్వారం: రెండు ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేశా. రూ.3లక్షలు వెచ్చించి బజాజ్ చేతక్, టీవీఎస్ క్యూబ్‌లను ఆరు నెలల క్రితం కొనుగోలు చేశా. వీటితో ఆర్థిక భారం తగ్గింది. పర్యావరణానికి మేలు చేకూరుతుంది. 5వేల కిలోమీటర్లు నడిపిస్తే రూ.500తో సర్వీసింగ్ పూర్తవుతుంది. నాలుగున్నర గంటలు చార్జింగ్ పెడితే వంద కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చు. ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయిస్తే వీటి వినియోగం పెరుగుతుంది. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే కొనుగోళ్లు పెరుగుతాయి.

– శివకుమార్, కోట్‌పల్లి

ఈకో మోడ్‌లో 105కి.మీ



దోమ: జూన్‌లో టీవీఎస్ కంపెనీకి చెందిన ఐక్యూబ్ మోడల్‌ను రూ.1.60లక్షలు వెచ్చించి కొనుగోలు చేశా. 80వేల కిలో మీటర్ల లేదంటే ఐదేళ్ల పాటు వారెంటీ, రూ.20వేల సబ్సిడీ అందజేశారు. నాలుగు గంటల పాటు చార్జ్ చేస్తే ఈకో మోడ్‌లో 50 స్పీడ్‌తో ప్రయాణిస్తే 105 కిలోమీటర్లు, పవర్‌మోడల్‌లో 80 స్పీడ్‌తో వెళ్తే 75 కిలోమీటర్లు తిరుగుతున్నా. కేవలం రూ.12 ఖర్చుతో (రెండు యూనిట్ల విద్యుత్) 105 కిలో మీటర్లు ప్రయాణిస్తున్నా.

– రామగోవర్ధన్‌రెడ్డి, గుండాల

'ఎల్‌ఆర్‌ఎస్'పై ఫోకస్



అధికారులతో సమావేశమైన కలెక్టర్ ప్రతీక్‌జైన్

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ఎల్‌ఆర్‌ఎస్(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) కింద భూముల క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్‌తో పాటు ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా భూముల క్రమబద్ధీకరణకు చేపట్టాల్సిన విధి విధానాలపై పలు సూచనలిచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్, పంచాయతీ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. జిల్లా లోని నాలుగు మున్సిపాలిటీలలో 20,968, గ్రామపంచాయతీల పరిధిలో 12,745 క్రమ బద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడుతూనే ప్రభుత్వ అను మతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను మూడు దశల్లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా కమిటీలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. క్రమబద్ధీకరణ క్రమంలో తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భూముల క్రమబద్ధీకరణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారుల సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి, డీపీఓ జయసుధ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి

అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన భూ సేకరణకు రైతులు సహకరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ కోరారు. అభివృద్ధి పనులను చేపట్టేందుకు భూ సేకరణ నిమిత్తం శనివారం అప్పాయిపల్లి రైతులతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. భూ సేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. ఎకరాకు 125 గజాల చొప్పున ఇంటి స్థలాలను కేటాయిస్తూ లేఅవుట్ అభివృద్ధి చేస్తామని వివరించారు. వైద్య (నర్సింగ్) కళాశాల, పశు వైద్యశాల ఏర్పాటుతో ప్రాంత అభివృద్ధితో పాటు విద్యార్హత మేరకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను మెమోరండం ద్వారా తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖ అధికారి పూర్ణ చంద్రారావు, డీసీహెచ్ఎస్ ప్రదీప్ కుమార్, కొడంగల్ తహసీల్దార్ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు

ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం, మున్సిపల్ పరిధిలోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీఓ కార్యాలయంలోని ధరణి సహాయ కేంద్రం, రికార్డు గదిని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్‌కు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన చిన్నారితో మాట్లాడారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు



అనంతగిరి: మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: విద్యార్థులకు ఇబ్బంది కలిగించినా, ర్యాగింగ్ చేసిన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయంలో షీటీం,భరోసా సెంటర్, కళాజాత బృందం సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. అవగాహన కార్యక్రమాలు చేపట్టి భరోసా కల్పించాలని సూచించారు. ఇబ్బందులకు గురైతే వెంటనే పోలీసులకు గానీ, షీటీం, భరోసా టీంకు గాని తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆడపిల్లల జోలికి వెళ్లిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, జిల్లా సైబర్ క్రైం కోఆర్డినేషన్ డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి,షీటీం, భరోసా, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

'మత్తు' వదిలిద్దాం

పూడూరు: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల మూలాలు గుర్తించి నిర్మూలించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఠాణాలోని ఫైళ్లను పరిశీలించి కేసుల వివరాలను ఆరాతీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. హైదరాబాద్–బీజాపూర్ రోడ్డుపై జరిగే ప్రమాదాల్లో ఎక్కువగా చన్గోముల్ పీఎస్ పరిధిలోనే జరుగుతున్నాయని.. వాహన తనిఖీలు పెంచి రోడ్డు ప్రమాదాలు నివారించాలని సూచించారు. భూ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దన్నారు. గ్రామాల్లోనూ గస్తీ పెంచాలని చెప్పారు. యువతను, గ్రామ నాయకులను చైతన్యం చేసి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. తినుబండారాల్లో నాణ్యత పాటించాలని చెప్పారు. నాసిరకం వస్తువుల అమ్మకాలు జరగకుండా నిఘా పెంచాలని తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైఓల్టేజీతో కాలిపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలు

తాండూరు రూరల్: విద్యుత్ హైఓల్టేజీతో ఇళ్లల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. ఈ సంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మిట్టబాసుపల్లి గ్రామ శివారు బర్కకాలనీలో శుక్రవారం అర్ధ రాత్రి హైఓల్టేజీ విద్యుత్ సరఫరా అయింది. దీంతో ఇళ్లల్లోని టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు కాలిపోయాయి. సరఫరా నిలిచిపోయింది. ఇదే విషయమై లైన్‌మెన్ పద్మారెడ్డిని వివరణ కోరగా.. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఫేజ్, న్యూటల్ కలపడంతో హైఓల్టేజీ విద్యుత్ సరఫరా అయిందని పేర్కొన్నాడు.

బకెట్లో పడి చిన్నారి మృతి


చిన్నారి మృతదేహంతో బంధువులు

పరిగి: బకెట్లో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ధర్మేందర్, వైశాలి దంపతులు పట్టణ కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. ధర్మేందర్ పరిగి స్టీల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. వీరికి ఎనిమిది నెలల చిన్నారి ఉంది. రోజు మాదిరిగా ధర్మేందర్ విధులకు వెళ్లగా.. వైశాలి ఇంట్లో పనిచేసుకుంటుంది. చిన్నారి ఆడుకుంటూ వెళ్లి బకెట్లో పడింది. తల్లి గమనించి పాపను బయటకు తీయగా.. స్పృహ కోల్పోయింది. వెంటనే పట్టణ కేంద్రంలోని చిన్నపిల్లల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎన్నో దేవుళ్లకు మొక్కగా లేక లేక పుట్టిన చిన్నారి కళ్ల ముందే నూరేళ్లు నిండడంతో ఆ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వ్యక్తి ఆత్మహత్య


మహేశ్(ఫైల్)

నందిగామ: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి రంగాపూర్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకోగా.. శనివారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాకారం మహేశ్(37) ఇంట్లోనే బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభించింది. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

బైక్ కొనివ్వడం లేదని విద్యార్థి అదృశ్యం


మహ్మద్ అవేస్(ఫైల్)

పహాడీషరీఫ్: తండ్రి బైక్ కొనివ్వడం లేదని ఇంటర్ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి వాదే ముస్తఫా బస్తీకి చెందిన మహ్మద్ గులాం పెద్ద కుమారుడు మహ్మద్ అవేస్(19) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తనకు బైక్ కొనివ్వాలంటూ కొంత కాలంగా అవేస్.. తండ్రిని కోరుతున్నాడు. ప్రస్తుతం డబ్బులు లేవని, తర్వాత కొనిస్తానని తండ్రి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఈ నెల 1న ఇదే విషయమై ఇంట్లో గొడవ జరిగింది. కాసేపటికే అవేస్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో గులాం ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు ఠాణాలో కానీ, ఈ నంబర్ 8712662367కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

స్నేహమే జీవితం.. శాశ్వతం

స్నేహం ఓ మధురం. ఓ వరం. గాఢాంధకారం అలుముకున్నా.. నిరాశా నిస్పృహలు చుట్టుముట్టినా.. భరించలేని కష్టం బాధపెట్టినా.. నీ కోసం నేనున్నానంటూ వెన్నుతట్టే ఆత్మీయ స్పర్శే స్నేహం. నిజమైన స్నేహం చివరి వరకు తోడుంటుంది. ఒంటరిలోనూ.. ఓటమిలోనూ తోడై నడుస్తుంది. కన్నీరు తుడుస్తుంది. కష్టాల్లో ధైర్యం చెబుతుంది. సమాజ సేవకు పరితపిస్తుంది. అలాంటి మైత్రిలోని మాధుర్యం చెప్పడానికి మాటలు చాలవు.

బాల్యమిత్రుల ఔదార్యం
- ఏటా పేద విద్యార్థులకు చేయూత
- సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్న ఫ్రెండ్స్
- నేడు స్నేహితుల దినోత్సవం


ఐనన్‌పల్లిలో ప్లేట్లు ఇస్తున్న బాల్య మిత్రులు (ఫైల్)

కొడంగల్: వారంతా బాల్య మిత్రులు. తాము సంపాదించిన దాంట్లో ఎంతోకొంత పేదవారికి, సర్కారు బడుల్లో విద్యనభ్యసించే చిన్నారులకు ఉపయోగ పడాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా 2009లో 'బాధ్యత స్వచ్ఛంద' సంస్థను నెలకొల్పారు. ఇక నాటి నుంచి చేయిచేయి కలిపి.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనందిస్తున్నారు. ఈ ఏడాది సుమారు 400 మంది చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు, వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. మండల పరిధి ఐనన్‌పల్లి, చిట్లపల్లి, పోచమ్మతండా, మైసమ్మతండా, ఖాజా అహ్మద్‌పల్లి, సంగాయిపల్లి, లక్ష్మీపల్లి, అన్నారం, బొంరాస్‌పేట మండలంలోని నాస్కాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలల్లో వితరణ కార్యకమం చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులకు బట్టలు, మందులు, ఆహారం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ నేపథ్యంలో వీరి సేవా కార్యక్రమాలను ప్రజలు, ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు. వారి 'బాధ్యత'తో పేద పిల్లలతో పాటు.. ఎంతో మందికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. 'బాధ్యత' బాల్య మిత్రులు నగేష్, కిట్టుస్వామి, లక్ష్మీనారాయణ జోషి, మురహరి వశిష్ట, కటుకం శివకుమార్ గుప్తా, ఆనంద్ కుమార్ లాహోటీ, కటుకం వెంకటేశ్, కృష్ణారావు, వేణు, కానుకుర్తి రమేష్ తదితరులు ఉన్నారు.

ఎవరికి ఆపదొచ్చినా..

బొంరాస్‌పేట: స్నేహం అంటే ఇద్దరి మధ్య ఏర్పడిన ఆత్మీయబంధం అనుకుంటాం. కానీ ఇక్కడ అలా కాదు. బొంరాస్‌పేట ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బాల్య మిత్రులంతా.. నేటికీ కలిసికట్టుగానే ఉన్నారు. సమాజ సేవలో తరిస్తున్నారు. మిత్రబృందం, సమాజంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందు వరుసలో ఉండి చేయూనందిస్తున్నారు.


1991లో వీడ్కోలు కార్యక్రమంలో ఉపాధ్యాయులతో బాల్యమిత్రులు


సమావేశంలో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి

'స్వచ్ఛదనం' విజయవంతం చేయాలి

ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి

దౌల్తాబాద్: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆమె మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాహారతి మాట్లాడారు. ఈ నెల 5వ తేదీ నుంచి 9వరకు నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు అధికారులతో పాటు ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. నిత్యం చేపట్టే కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించాలని చెప్పారు. 5న ర్యాలీలతో అవగాహన చేపట్టి, 9వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఇందులో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దారు విజయ్‌కుమార్, ఎస్‌ఐ రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా చేపట్టాలి

అనంతగిరి: రేపటి నుంచి 5రోజుల పాటు చేపట్టనున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ సుధీర్ సంబధిత అధికారులను ఆదేశించారు. శనివారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చెప్పారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీఓ దయానంద్, మండల వ్యవసాయ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

- పలువురికి గాయాలు
- గోప్యంగా ఉంచిన యాజమాన్యం


ఫ్యాక్టరీలో చెలరేగుతున్న మంటలు

పరిగి: సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో శనివారం అగ్నిప్రమాదం జరిగి, పలువురు కార్మికులు గాయపడినట్లు తెలిసింది. ఘటన వివరాలను యాజమాన్యం గోప్యంగా ఉంచింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్మాగారంలో ఎలాంటి పరిశీలన జరకుండానే కొత్తగా బట్టీని అమర్చారని, దీంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఫ్యాక్టరీలో అత్యధిక కార్మికులు ఇతర రాష్ట్రాలకు చెందినవారేనని, ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాపాయం కలిగినా.. యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా తోచిన పరిహారం చెల్లించి చేతులు దులుపుకొంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు, పోలీసులు అటువైపు చూడటం లేదని ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. తగిన విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం


సమావేశంలో మాట్లాడుతున్న హర్షితరెడ్డి

జిల్లా ఐటీ కోఆర్డినేటర్ హర్షితరెడ్డి

బొంరాస్‌పేట: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం అని, ఆరు నెలలు తప్పనిసరిగా పట్టాలని చైల్డ్ డెవలప్‌మెంట్ జిల్లా ఐటీ కోఆర్డినేటర్ హర్షితరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం అంగన్‌వాడీ కేంద్రం–3లో తల్లిపాల వారోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని చెప్పారు. జీర్ణవ్యవస్థను మెరుగు పరిచి, ఎదుగుదలను పెంచుతుందని తెలిపారు. ఇందులో ప్రోగ్రామ్ అధికారి వెంకటేశ్వరమ్మ, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

సీఐ భూపాల్‌శ్రీధర్


మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాడుపడాలని చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి గ్రామర్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ భూపాల్‌శ్రీధర్ మాట్లాడుతూ.. మానవ మనుగడకు మూలాధారమైన అడవులను కాపాడి వన్యప్రాణుల సంరక్షణకు మనమెంతో కృషి చేయాలన్నారు. అడవుల అభివృద్ధికి కృషి చేయటంతో పాటు రహదారుల వెంట గ్రామీణ ప్రాంతాల వీధుల్లో ప్రభుత్వ కార్యాలయల్లో పాఠశాలల ఆవరణలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే మొక్కలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా హరితహారాన్ని ప్రోత్సహిస్తూ విరివిగా మొక్కలు నాటాలని సూచిస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నల్లా నాయకుడు, ప్రిన్సిపాల్ స్నేహలతశ్రీ, అరుణ్, ఏఓ శివరామ్, మహేందర్‌రెడ్డి, పీఈటీ మల్లేశ్ రాము, నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేసే పనులే గుర్తింపు తెస్తాయి


డీఈ వెంకట్రావ్‌ను సన్మానిస్తున్న ఈఈలు తదితరులు

పీఆర్ ఈఈ సత్యనారాణరెడ్డి, ఉమేష్‌కుమార్

తాండూరు రూరల్: విధి నిర్వహణలో భాగంగా చేసే పనులే గుర్తింపు తెస్తాయని, ప్రజల మన్ననలు పొందగలుగుతామని పంచాయతీరాజ్ తాండూరు డివిజన్ ఈఈ సత్యానారాయణరెడ్డి, వికారాబాద్ డివిజన్ ఈఈ ఉమేష్‌కుమార్‌లు అన్నారు. పీఆర్ తాండూరు–పెద్దేముల్ డీఈ వెంకట్రావ్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలోని తులసిగార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈలు మాట్లాడారు. డీఈ వెంకట్రావ్ మృధుస్వభావి అని కొనియాడారు. అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులతో సమన్వయంతో పని చేశారని గుర్తు చేశారు. 2018 నుంచి తాండూరులో పనిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ కృష్ణ జోషి, డీఏఓ రవికుమార్, ఏఈలు సంతోష్, నందిని, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, పెద్దేముల్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించి.. ఏఈఈగా..

గెజిటెడ్ హోదా కొలువు సాధించిన జీపీ కార్మికుడి కూమారుడు


నరేష్

కుల్కచర్ల: విజ్ఞానానికి పేదరికం అడ్డు కాదని నిరూపిస్తూ.. ఆత్మవిశ్వాంతో అత్యున్నతమైన కొలువు సాధించాడు పంచాయతీ కార్మికుడి కుమారుడు. కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన దేవమ్మ వెంకటయ్య దంపతులకు ముగ్గురు సంతానం. అందులో చిన్నవాడు నరేష్. కటిక పేదరికాన్ని అనుభవిస్తూ చదువులో మేటిగా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఇరిగేషన్‌శాఖ రిక్రూట్‌మెంట్‌లో నరేష్ పరీక్ష రాశాడు. అనంతరం శుక్రవారం విడుదలైన ఫలితాల్లో నరేష్ ఏఈఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్)గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా యువకుడు మాట్లాడుతూ.. కష్టపడి చదివితే లక్ష్యం ఎంత పెద్దదైనా మనసొంతం అవుతుందని సూచించాడు. తనకోసం కుటుంబ సభ్యులు ఎంతగానో శ్రమించారని, వారి ప్రేమానురాగాలతోనే ఈ ఉద్యోగం సాధించాను అని చెప్పారు.

వెటర్నరీ అధికారి సస్పెండ్

ధారూరు: 'ఆస్పత్రి బోర్డుకు మేక కళేబరం' అనే శీర్షికన ఆగస్టు 1న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి కలెక్టర్ ప్రతీక్‌జైన్ స్పందించారు. సంబంధిత అధికారిని సస్పెండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు మండలం నాగారం గ్రామంలో వైద్యం అందక మేక చనిపోయిందన్న బాధతో కాపరి అల్లీపూర్ దశరథ్.. పశువైద్యశాల భవనానికి ఉన్న బోర్డుకు మూగజీవి కళేబరాన్ని వేలాడదీసి నిరసన వ్యక్తం చేసిన విషయం విధితమే. ఈ సంఘటనపై స్పందించిన కలెక్టర్.. వీఎల్ఓ సురేందర్‌నాయక్‌ను పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూగజీవి చనిపోవడానికి కారణం మీరే అని నిర్ధారించిన పాలనాధికారి.. ఈ నెల 1న సస్పెన్షన్ చేయగా.. శుక్రవారం వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్‌కు వికారాబాద్ పశు సంవర్ధక శాఖ అధికారి పూర్ణచందర్ సస్పెన్షన్ ఆర్డర్‌ను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆమగనల్లు: హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆమనగల్లు మండలం పులుగోనిపల్లితండాకు చెందిన రమేశ్‌నాయక్(40) తన ఆటోలో తండాకు వెళ్తుండగా.. పట్టణ సమీపంలోని విఠాయిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్.. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. మృతుడికి భార్య సీత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వరద బాధితులకు చేయూతనివ్వాలి


విరాళాల సేకరణ చేపట్టిన నాయకులు

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: కేరళ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో శనివారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో తిరుగుతూ.. భారీ వర్షాలకు అక్కడ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో సీపీఐ ఆధ్వర్యంలో ఈ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. తోచిన సహాయం అందించాలని కోరారు. వీటిని తమ పార్టీ తరపున కేరళ బాధితులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆపదలో అండగా నిలబడి వారికి చేయూతనందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, షాబాద్ మండల కార్యదర్శి జంగయ్య, శంకర్‌పల్లి కార్యదర్శి సుధీర్, కృష్ణగౌడ్, సాయిలు, నర్సింలు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య కోరారు. శనివారం మండల పరిధిలోని చిన్న సోలీపేట్ గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాస్కర్ ఆస్పత్రి, శ్రీబాలాజీ దంత వైద్యశాల మెడికల్ కళాశాల సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు గ్రామానికి చెందిన మొత్తం 105 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ సాయికృష్ణ, సాహితీ వైద్యుల బృందం కంటి, కీళ్ల, ఛాతి, చిన్న పిల్లలకు సంబంధించిన వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

కేశంపేట: మొక్కజొన్నలో కత్తెరపురుగు పంటను నాశనం చేస్తుందని, పురుగు నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శిరీష అన్నారు. ఈ పురుగు నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు మండల వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కత్తెర పురుగునే లద్దె పురుగు అని కూడా అంటారని ఆమె తెలిపారు. ఈ పురుగు ఆరు దశలను కలిగి పంటను నాశనం చేస్తుందన్నారు. కత్తెర పురుగును నివారించేందుకు క్లోరిపైరిఫాస్ 20 ఇసి, 2, 5 మిలీలను లీటర్ నీటిలో కలిపి పంటపైన పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే అమామెక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేయాలని తెలిపారు. మరింత సమాచారం కోసం రైతులు సమీపంలోని రైతు వేదికల్లో ఉండే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

మున్సిపల్ ఎజెండాను వ్యతిరేకించిన కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్ వ్యక్తిగతం అంటూ సభ్యుల ఆందోళన
- సర్దిచెప్పిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులకు నిధులంటూ హామీ


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ఎజెండాపై సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఎజెండా చైర్‌పర్సన్ వ్యక్తిగతంగా ఉందంటూ ధ్వజమెత్తగా.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జోక్యంతో వ్యవహారం సద్దుమణిగింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో తొలుత 34 అంశాలతో కూడిన ఎజెండాను సభ్యుల ఆమోదం కోసం ప్రవేశపెట్టగా.. పలు అంశాలను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. దీంతో ఎమ్మెల్యే బీఎమ్మార్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులకు నిదులు కేటాయిస్తామని, ఎజెండాలోని అంశాలపై మాట్లాడేందుకు అందరికీ అవకాశం ఇస్తామని చెప్పడంతో సభ్యులు శాంతించారు.

పారిశుద్ధ్య పనులు ప్రైవేటు పరమా!

పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని, చెత్త సేకరణకు ఇంటింటికీ డబ్బులు వసూలు చేసే విధానం సరికాదంటూ కౌన్సిలర్లు శోభారాణి, సోమశేఖర్, సంగీతా ఠాకూర్‌లు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో ఎమ్మెల్యే బీఎమ్మార్ స్పందించి.. పారిశుద్ధ్యం విషయంలో ఎలాంటి సమస్య చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సభ్యులు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలు, అంతర్గత రోడ్లు, అంగన్‌వాడీ భవనాలకు ప్రహరి నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. మున్సిపాలిటీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరగా.. వాటిని హింసించే హక్కు ఎవరికీ లేదని, మున్సిపల్ పరిధిలో ఎకరా స్థలాన్ని కేటాయించి శునకాలకు చికిత్స చేయించి, అక్కడే ఉండేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తలిపారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

వార్డుల్లో మురుగు కాల్వలు లేక ఇబ్బందుతు తలెత్తుతున్నాయని పలువురు కౌనిలర్లు కౌన్సిల్ దృష్టికి తేగా.. మున్సిపల్ కమిషనర్ కల్పించుకొని మురుగు కాల్వలు నిర్మించేందుకు తొమ్మిది సార్లు టెండర్లు వేశామని, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఆయన తెలిపారు. నిర్మాణదారులు ముందుకు వస్తే పనులు చేయిస్తామని పేర్కొన్నారు. అత్యవసర పనులకు కేటాయించిన రూ.5లక్షల నిధులను ప్రతి వార్డుకు సమానంగా పంచాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

చిలుకవాగు ప్రక్షాళన పనులు షురూ

మిషన్ భగీరథకు సంబంధించి పైప్‌లైన్ పనులకు మున్సిపల్ నిదులు రూ.20 లక్షలను కేటాయించడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. చిలుకవాగు అన్యాక్రాంతం అయిందని, తద్వారా ఆదర్శనగర్ కాలనీ వరద ముంపునకు గురవుతోందని కౌన్సిలర్లు పేర్కొనగా.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీన రూ.16 కోట్లతో చిలుకవాగు ప్రక్షాళన పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. సమావేశం తొలుత కౌన్సిల్ సభ్యుల మధ్య గొడవలు జరిగినప్పటికీ.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల ప్రశాంతంగా జరిగింది. ఎజెండాలోని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైరపర్సన్ దీప, కౌన్సిలర్లు పట్లోళ్ల రత్నమాల, సింధుజగౌడ్, పట్లోళ్ల నీరజా బాల్‌రెడ్డి, సైదాసల్మాఫాతిమా, ఆసిఫ్, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, వెంకన్నగౌడ్, బోయ రవిరాజ్, వరాల శ్రీనివాస్‌రెడ్డి, అంతారం లలిత, మధుబాల, మమత, భీంసింగ్ రాథోడ్, సాజిద్‌అలీ, మున్సిపల్ మెనేజర్ నరేందర్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.